JAYABHERIDAILY.COM
ప్రభాత జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 20-05-2026
Medchal - Malkajgiri | Wednesday 20-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 353
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 353 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# ట్రంప్ వార్నింగ్‌తో ప్రపంచంలో కలకలం

- ఇరాన్‌పై భారీ దాడులకు సిద్ధంగా అమెరికా?
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ

జయభేరి, న్యూ ఢిల్లీ, మే 19 :

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న కాల్పుల విరమణ ప్రతిష్టంభన అంతకంతకూ ముదురుతోంది. ఇరు దేశాల మధ్య దాడులు తాత్కాలికంగా నిలిచిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. శ్వేతసౌధం (వైట్ హౌస్) వేదికగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం రాకూడదనే తాము భావిస్తున్నామని, కానీ ఇరాన్ దారికి రాకుంటే ఆ దేశానికి మరో పెద్ద దెబ్బ రుచి చూపించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే ఈ విషయంలో తానేమీ ఇంకా ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రాలేదని, దీనికి సంబంధించిన పరిణామాలు ప్రపంచానికి త్వరలోనే తెలుస్తాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ పట్ల అమెరికా ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక ఆ దేశ అణు కార్యక్రమాలే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరాన్ లాంటి దేశం చేతికి అణ్వాయుధాలు చిక్కితే ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లుతుందని వాషింగ్టన్ మొదటి నుండి గట్టిగా నమ్ముతోంది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండటానికి తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని కరాఖండిగా చెప్పారు. చర్చల ద్వారా శాంతియుత ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్‌కు తాము చాలా "పరిమిత సమయం" మాత్రమే ఇస్తున్నామని, ఒకవేళ ఆ దేశం అణ్వాయుధాన్ని తయారు చేస్తే దానిని వారు ఖచ్చితంగా ఇతర దేశాలపై ఉపయోగిస్తారనడంలో తన మనసులో

...మిగతాది 2 లో

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యాను. పాలమూరు,-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించాను. భూ సేకరణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేలా చూస్తానని హామీ ఇచ్చాను. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించాను.

- భూ సేకరణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేలా చూస్తానని హామీ

జయభేరి, హైదరాబాద్ :

పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలకమైన సూచనలు చేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు.



# తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది


- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరిక

జయభేరి, న్యూ ఢిల్లీ, మే 19 :

భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. "భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని

...మిగతాది 2 లో





# జలమండలిలో భారీ అవినీతి తిమింగలం

- రూ. 100 కోట్లకు పైగా ఆస్తులు.. లాకర్లలో ఇంకెంతుందో!
- ఇంట్లో కుప్పలుగా నోట్ల కట్టలు – కౌంటింగ్ మెషీన్ల రంగప్రవేశం
- బినామీల పేర్లతో భారీగా భూములు, ప్లాట్లు
- కుమార్తె పెళ్లికి వందల కోట్ల ఖర్చు, లగ్జరీ లైఫ్
- ముందుంది బ్యాంకు లాకర్ల వేట

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ (జీఎం) అనంత్ లక్ష్మీ కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం అధికారికంగా అరెస్ట్ చేశారు. మంగళవారం ప్రారంభమైన ఈ ఏసీబీ సోదాలు రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగాయి. కుమార్‌తో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో జరిపిన తనిఖీల్లో కళ్ళు చెదిరేలా అక్రమ ఆస్తుల సామ్రాజ్యం వెలుగు చూసింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆస్తుల విలువ కొన్ని కోట్లలో చూపిస్తున్నప్పటికీ, వాటి బహిరంగ మార్కెట్ విలువ దాదాపు రూ. 100 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

...మిగతాది 2 లో

# కేసీఆర్-జగన్-విజయ్ రీజనల్ ఫ్రంట్...

2 లో

# తీరం మనదే.. మత్స్య సంపదా మనదే

- మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడతాం
- చేపల వేటకు సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు
- నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే
- మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం
- ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం - గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం
- నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



జయభేరి, నెల్లూరు/కావలి, మే 19:

తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్య కారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్యకార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్య కారుల

...మిగతాది 2 లో



# విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

జయభేరి, చెన్నై, మే 19 :

తమిళనాడు రాజకీయాల్లో 59 ఏళ్ల ద్రవిడ పార్టీల ఏకఛత్రాధిపత్యాన్ని బద్దలు కొడుతూ నటుడు విజయ్ టీవీకే పార్టీ అధికార పీఠాన్ని దక్కించుకున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా గడవకముందే.. విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చంటూ మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు డీఎంకే పరాజయానికి పూర్తి నైతిక బాధ్యత వహిస్తూనే.. మరోవైపు 2029 పార్లమెంట్ ఎన్నికలతో పాటే రాష్ట్రానికి ముందస్తు ఎన్నికలు రావడం ఖాయమని చెప్పారు. తమిళనాడులో దశాబ్దాల కాలంగా సాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి బ్రేక్ వేస్తూ.. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధికారంలోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ కొత్త ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని, రాష్ట్రంలో ఎప్పుడైనా ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందంటూ మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ సంచలన కామెంట్లు చేశారు. అలాగే ప్రస్తుతం విజయ్ ప్రభుత్వం అత్యంత బలహీనమైన పునాదులపై నడుస్తోందని.. డీఎంకే శ్రేణులంతా ఎప్పుడైనా రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

...మిగతాది 2 లో

# కేసీఆర్-జగన్-విజయ్ రీజనల్ ఫ్రంట్...




ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్ లో రీజనల్ రెలిజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారుతెలుగు రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ప్రధాని నరేంద్ర మోడీ తాజా పర్యటన దారి తీసింది. ఇక్కడ ఒక విషయం ఫుల్ క్లారిటీ వచ్చింది.ఎన్డీయే బంధం మరింత పటిష్టం అయింది అని. పైగా టీడీపీ బీజేపీ జనసేన 2029 లో కూడా కలసికట్టుగా సాగుతాయని అర్థం అవుతోంది.అంతే కాదు ఈ మోడీ బాబు పవన్ ల మధ్య మిత్ర బంధం మరింత బలీయం అయింది. దాంతో వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణాలో బీఆర్ఎస్ తో బీజేపీ కలుస్తుందన్న ప్రచారం పూర్తిగా పక్కకు పోయింది. అలాగే ఏపీలో వైసీపీతో ఏదో నాటికి బీజేపీ స్నేహ హస్తం గట్టిగా అందిస్తుందన్న ఆశలూ అడుగంటాయని అంటున్నారు.ఈ నేపథ్యంలో ఎన్డీయేకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వైసీపీకి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా ఎన్డీయేకు మద్దతు పరోక్షంగా అయినా ఇస్తూ పోతే అది పార్టీ జనంలో బయట జనంలో తప్పుడు సంకేతాలు ఇచ్చే చాన్స్ ఉంటుంది. వాటికి మించి వైసీపీకి బలంగా ఒక్క మైనారిటీ ఎస్సీ ఎస్టీ ఓటు బ్యాంక్ కూడా రివర్స్ అవుతుందన్న చర్చ కూడా ఉందని అంటున్నారు. ఇక ఏపీలో 2029 ఎన్నికల్లో బాబు పవన్ మోడీల త్రిమూర్తులను వైసీపీ అధినేత జగన్ మరోసారి ఎదుర్కోవాల్సిన పరిస్థితి అయితే ఉంది. దాంతో వైసీపీ ఇక మూడేళ్ళు ముందుగానే తన రాజకీయ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు.తెలంగాణాలో కేసీఆర్ విషయం తీసుకుంటే కాంగ్రెస్ అక్కడ స్థానికంగా అధికారంలో ఉంది. దాంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తో నేరుగా చేతులు కలపలేని పరిస్థితి ఉంది. అలాగని బీజేపీతో కలసి ముందుకు సాగే సీన్ కూడా లేదు, బీజేపీతో బాహాటంగా కలిస్తే మైనారిటీ ఓట్లు ఇతర అణగారిన వర్గాల ఓట్లు పోతాయన్న భయం ఉంది. అయితే బీజేపీ పట్ల ఎంతో కొంత సాఫ్ట్ కార్నర్ తో అయితే బీఆర్ఎస్ ఉందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ వర్గాలు ఇంతకాలం చేస్తూ వచ్చాయి. అందులో నిజమెంత ఉందో తెలియదు కానీ ఇపుడు మాత్రం మోడీ బాబు పవన్ తెలంగాణాలో కూడా ఎన్డీయే గా ముందుకు వస్తే మాత్రం బీఆర్ఎస్ కొత్త ఆలోచనలు చేయాల్సిందే అన్నది కూడా గులాబీ పార్టీలో ఉంది:

ఇదిలా ఉంటే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి వైపు కేసీఆర్ జగన్ చూపు పడుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఎంత లేదనుకున్నా కాదనుకున్నా జాతీయ రాజకీయాన్ని కూడా గమనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అంతే కాదు తెలంగాణాలో ఏకంగా మోడీయే రంగంలోకి దిగితే ప్రాంతీయ పార్టీలతో అయినా చెలిమి చేయడం ద్వారా బలం పెంచుకోవాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతోనే తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి టీవీకే అధినేత విజయ్ తో స్నేహం నెరిపే విషయంలో బీఆర్ఎస్ ఉత్సాహం చూపిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత జగన్ కూడా విజయ్ తో చెలిమి చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు కీలక పార్టీలు ఇపుడు జాతీయ రాజకీయాల్లో కొత్త రూట్ లోకి వెళ్తున్నాయా అన్న చర్చ సాగుతోంది. నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు.ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తూంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు. ఒక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే ఆ పార్టీ తెలంగాణాలో చేసిన పదేళ్ల పాలనలో కాళేశ్వరం నుండి ఫార్ములా వన్ కార్ రేసింగ్ వరకు భారీ త్తున ఆరోపణలు ఈ రోజుకీ సంచలనంగానే ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు తమిళనాడులో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన టీవీకే పార్టీ మీద కూడా అవినీతి మరకలు ఆరంభంలోనే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదెలా అంటే టీవీకేలో ఆ పార్టీ కీలక నేత, మంత్రి అధర్వ అర్జున్ తండ్రి లాటరీ కింగ్ అని చెబుతున్నారు. కూటమి సాధ్యమా : అయితే ఈ ముగ్గురు నాయకులూ తమ ప్రభావాన్ని రాజకీయంగా దక్షిణాదిన చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని కోసం ప్రాంతీయ కూటమిని కట్టాలని కూడా వ్యూహ రచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే ఉంది. కానీ అవినీతి ఆరోపణలు ఒక వైపు మరో వైపు మత రాజకీయాలను ముందుకు తీసుకుని రావడం వంటివే అడ్డంకిగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. అయితే దక్షిణాదిన ఎన్డీయే కూటమిని మరీ ముఖ్యంగా చంద్రబాబుకు ముకు తాడు వేయాలని ఈ కూటమి పెద్దల ప్రధాన లక్ష్యమని అంటున్నారు. మరి వీరి ఆశలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయన్నది తెలియాలన్నా అనేక ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా కొంత కాలం పాటు వేచి చూడాల్సి ఉందని అంటున్నారు.మరో వైపు చూస్తే ఇండియా కూటమిలో కాంగ్రెస్ సారధ్యం కాకుండా ఏ మమతా బెనర్జీ లాంటి వారో పగ్గాలు అందుకుంటే తెలుగు నాట కూడా కొత్త పార్టీలు అందులో చేరేందుకు వీలు ఉంటుందని అంటున్నారు. మొత్తానికి ఎన్డీయే తెలుగు రాష్ట్రాలలో బలంగా ఉండాలని మోడీ నిర్ణయించిన నేపథ్యంలో అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ రెండూ అలెర్ట్ అయినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ట్రంప్ వార్నింగ్‌తో ప్రపంచంలో..

ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇరాన్ పాలకులు తీవ్రంగా రాడికలైజ్ అయ్యారని, తానే స్వయంగా ఈ వ్యక్తులతో పక్కాగా వ్యవహరిస్తానని ఆయన జోడించారు. వాస్తవానికి ఫిబ్రవరి 28న అమెరికా జరిపిన ఆకస్మిక దాడులతో ఈ మధ్యప్రాచ్య (మిడిల్ ఈస్ట్) సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. ఆ తర్వాత అంతర్జాతీయ సమాజం, వివిధ దేశాల మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు తమ ప్రతిపాదనలను మార్చుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 8 నుండి వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ఒక పెళుసైన, అత్యంత సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనిస్తే ఈ తాత్కాలిక శాంతి ఏ క్షణంలోనైనా ముగిసిపోయేలా కనిపిస్తోంది. ఈ ఉద్రిక్తతలపై ట్రంప్ మరికొన్ని ఆసక్తికర విషయాలను కూడా వెల్లడించారు. తాము ఇరాన్‌పై తిరిగి దాడులు చేయడానికి అన్ని వ్యూహాలను సిద్ధం చేశామని, సైన్యానికి ఆదేశాలు ఇవ్వడానికి తాను కేవలం ఒక గంట దూరం మాత్రమే ఉన్నానని ఆయన పేర్కొన్నారు. తమ సాయుధ బలగాలు పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని, తాను గనుక సైన్యాన్ని ఆదేశించి ఉంటే ఈపాటికే ఇరాన్‌పై భారీ దాడులు జరిగి ఉండేవని స్పష్టం చేశారు. అంతకుముందు, అధ్యక్షుడు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'ట్రూత్ సోషల్' లో ఒక పోస్ట్ పెట్టారు. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా తలపెట్టిన సైనిక దాడిని ప్రస్తుతానికి వాయిదా వేయాలని గల్ఫ్ ప్రాంతానికి చెందిన పలువురు అరబ్ దేశాల నాయకులు తనను స్వయంగా కోరినట్లు అందులో పేర్కొన్నారు. వారి అభ్యర్థనను మన్నించినప్పటికీ, ఇరాన్ గనుక ఒక ఆమోదయోగ్యమైన ఒప్పందానికి రాకపోతే, ఏ క్షణంలోనైనా ఆ దేశంపై పూర్తిస్థాయిలో, అత్యంత భారీ స్థాయిలో సైనిక దాడులు చేయడానికి సిద్ధంగా ఉండాలని తాను అమెరికా రక్షణ విభాగాన్ని (పెంటగాన్) ఆదేశించినట్లు ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడి తీవ్ర వ్యాఖ్యలపై ఇరాన్ దౌత్య మరియు సైనిక వర్గాలు కూడా అంతే వేగంగా స్పందించాయి. ట్రంప్ వ్యాఖ్యల అర్థం, అమెరికా నాయకుడు ఇరాన్‌ను నేరుగా 'బెదిరిస్తూ', దానిని ప్రపంచం ముందు 'శాంతికి ఇస్తున్న అవకాశం' అని అబద్ధాలు చెప్తున్నారని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ గరీబాబాది సామాజిక మాధ్యమం 'X' (ట్విట్టర్) వేదికగా విమర్శించారు. అమెరికా కేవలం బెదిరింపుల రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. మరోవైపు మంగళవారం నాడు ఇరాన్ సైనిక అధికార ప్రతినిధి మొహమ్మద్ అక్రమీనియా అమెరికాను హెచ్చరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అమెరికా గనుక కాల్పుల విరమణను ఉల్లంఘించి దాడులను తిరిగి ప్రారంభిస్తే, తాము చూస్తూ ఊరుకోబోమని, అమెరికాకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో "కొత్త యుద్ధరంగాలను తెరుస్తామని" హెచ్చరించారు. అంతేకాకుండా, ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ సమయాన్ని ఇరాన్ సైన్యం "తమ పోరాట సామర్థ్యాలను మరియు ఆయుధ సంపత్తిని మరింత బలోపేతం చేసుకోవడానికి" ఒక గొప్ప అవకాశంగా ఉపయోగించుకుందని ఆయన పేర్కొన్నారు. అయితే, వారు సైనిక సామర్థ్యాలను ఎలా పెంచుకున్నారనే విషయాలపై ఆయన మరింత వివరణ ఇవ్వడానికి నిరాకరించారు. ఈ పరస్పర బెదిరింపుల పర్వం కొనసాగుతుండగానే, మధ్యప్రాచ్యంలో మరో ఆందోళనకర పరిణామం వెలుగులోకి వచ్చింది. గత ఆదివారం (మే 17, 2026) నాడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) లోని ప్రసిద్ధ 'బరకా అణు విద్యుత్ కేంద్రం'పై జరిగిన డ్రోన్ దాడి ఇరాక్ భూభాగం నుంచే జరిగిందని ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాంతంలో గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్న వివిధ ఉగ్రవాద, తిరుగుబాటు గ్రూపులకు ఇరాన్, ఇరాక్ భూభాగం నుంచే పూర్తిస్థాయిలో ఆర్థిక, ఆయుధ మద్దతు ఇస్తోందనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. బరకా అణు ప్లాంట్‌పై జరిగిన ఈ దారుణ దాడిపై కొనసాగుతున్న ఉన్నత స్థాయి దర్యాప్తులో భాగంగా.. సాంకేతిక ట్రాకింగ్, రాడార్, శాటిలైట్ పర్యవేక్షణ ఆధారంగా ఆ మూడు డ్రోన్లు అన్నీ కూడా ఇరాక్ సరిహద్దుల నుంచే ఎమిరేట్స్ వైపు దూసుకొచ్చినట్లు రక్షణ శాఖ నిర్ధారించింది. ఈ ప్రాంతంలో ఎలాగైనా సరే యుద్ధాన్ని ముగించి, ఇరాన్‌అమెరికాల మధ్య ఒక శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేలా అంతర్జాతీయ దౌత్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ శాంతి చర్చలలో ఒక కొలిక్కి రావడానికి మరియు ఇరుపక్షాలపై ఒత్తిడి తెచ్చేందుకు "మరింత సమయం" అవసరమని ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మజేద్ అల్‌అన్సారీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రతిష్టంభన త్వరలోనే వీడకపోతే మధ్యప్రాచ్యం మరోసారి పెను యుద్ధ మేఘాల కిందకు వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్ అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు."

**ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్నరైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

## విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా..

ఎంకే స్టాలిన్ చేసిన ఈ కామెంట్లు దేశ వ్యాప్తంగా సంచలన రేపుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో టీవీకే పార్టీకి సొంతంగా 107 స్థానాలు ఉండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. దీనికి తోడు రెండు సీట్లున్న వీసీకే, రెండు స్థానాలున్న సీపీఐ, మరో రెండు సీట్లు కల్గిన సీపీఎం, ఇంకో రెండు సీట్లున్న ఐయూఎంఎల్ పార్టీలు కూడా విజయ్‌కే మద్దతు ఇస్తుండటంతో టీవీకే ప్రభుత్వం మెజారిటీని నిలబెట్టుకుంది. వీటితో పాటు గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో జోసెఫ్ విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే (ఏఐఏడీఎంకే) తిరుగుబాటు ఎమ్మెల్యేల మద్దతు కూడా తోడైంది.అయితే ఈ రాజకీయ సమీకరణాలు ఎంతో కాలం సాగవని డీఎంకే వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ బయట నుంచి మద్దతు ఇస్తున్న వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ వంటి పార్టీలు తమ మద్దతును ఉపసంహరించుకున్నా.. లేదా విపక్ష పార్టీకి చెందిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలపై స్పీకర్ లేదా కోర్టులు అనర్హత వేటు వేసినా విజయ్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని స్టాలిన్ లెక్కగడుతున్నారు. "ప్రస్తుత పాలన ఎప్పుడైనా పడిపోవచ్చు. బహుశా 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమిళనాడు అసెంబ్లీకి కూడా మళ్లీ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి పార్టీ శ్రేణులు ఇప్పుడే రంగంలోకి దిగాలి. అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలి" అని జిల్లా కార్యదర్శుల సమావేశంలో స్టాలిన్ దిశానిర్దేశం చేశారు.గత ఎన్నికల్లో డీఎంకే ఘోర పరాజయాన్ని చవిచూడటమే కాకుండా స్వయంగా స్టాలిన్ కూడా తన కొలత్తూరు నియోజకవర్గంలో ఓడిపోవడం ఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది. ఈ ఓటమికి పూర్తి నైతిక బాధ్యత తనదేనని స్టాలిన్ ప్రకటించారు. "ఈ ఓటమి తాత్కాలికం మాత్రమే. తమిళనాడులో డీఎంకే సూర్యుడు ఎప్పటికీ అస్తమించదు. గతంలోనూ మనం ఎన్నో ఎదురు దెబ్బలను తట్టుకుని బౌన్స్ బ్యాక్ అయ్యాం. మళ్లీ అధికారంలోకి వస్తాం" అని క్యాడర్‌లో ధైర్యం నింపారు .ఈ సందర్భంగా ప్రత్యర్థి విజయ్ పార్టీ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో దూసుకుపోతుండటాన్ని స్టాలిన్ పరోక్షంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు మనం టీ కొట్టుల్లో మాట్లాడిన రాజకీయాన్ని.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాల్సిన అవసరం వచ్చింది" అని ఐటీ వింగ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అలాగే అసలు ఓటమికి గల కారణాలను అన్వేషించడానికి, ప్రజల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించడానికి 36 మంది సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా డీఎంకే ఏర్పాటు చేసింది. మరోవైపు డీఎంకే విమర్శలపై సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే వర్గాలు అంతగా స్పందించడం లేదు. తమ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఐదేళ్ల పూర్తి కాలం పాలిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## జలమండలిలో భారీ అవినీతి తిమింగలం

**ఇంట్లో కుప్పలుగా నోట్ల కట్టలు – కౌంటింగ్ మెషీన్ల రంగప్రవేశం**

ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని జీఎం కుమార్ ప్రధాన నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులకు అక్కడ లభించిన నగదు చూసి నోరెళ్లబెట్టారు. ఇంట్లోని బెడ్‌రూమ్‌లు, అల్మారాల్లో ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున కరెన్సీ నోట్ల కట్టలు కుప్పలుగా దర్శనమిచ్చాయి. చేత్తో లెక్కించడం సాధ్యం కాకపోవడంతో అధికారులు ప్రత్యేకంగా కౌంటింగ్ మెషీన్లను రప్పించి నగదును లెక్కించారు. ఈ తనిఖీల్లో రూ. 1.10 కోట్ల నగదు పట్టుబడగా, వీటితో పాటు 2.1 కిలోల బంగారు ఆభరణాలు, 9.2 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**బినామీల పేర్లతో భారీగా భూములు, ఫ్లాట్లు:**

జలమండలిలో కీలక పదవిలో ఉన్న కుమార్, తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున అవినీతి సొమ్మును స్థిరాస్తుల్లో పెట్టుబడిగా పెట్టినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. నిజామాబాద్ జిల్లాలో 3 ఎకరాల విలువైన వ్యవసాయ భూమిని కలిగి ఉన్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్ నగరంలోని ఒక లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలో మూడు విలాసవంతమైన ఫ్లాట్లతో పాటు, నగర పరిసర ప్రాంతాల్లో మరో 6 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు కుమార్ నివాసం నుంచి 2 లగ్జరీ కార్లు, ఒక బైక్‌ను సీజ్ చేశారు. కేవలం రిజిస్ట్రేషన్ విలువల ప్రకారమే ఈ ఆస్తుల విలువ రూ. 5.88 కోట్లుగా ఉండగా, ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం వీటి విలువ రూ. 100 కోట్ల మార్కును దాటుతుందని అధికారులు వెల్లడించారు.

**కుమార్తె పెళ్లికి వందల కోట్ల ఖర్చు, లగ్జరీ లైఫ్**

గత నెలలోనే కుమార్ తన కుమార్తె వివాహాన్ని అత్యంత వైభవంగా, అంగరంగ వైభవంగా జరిపించినట్లు సమాచారం. ఈ వివాహ వేడుక కోసమే కొన్ని వందల కోట్ల రూపాయలు నీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారనే వార్తలు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారాయి. ఒక ప్రభుత్వ అధికారి స్థాయికి మించి జరిగిన ఈ వివాహ ఖర్చులపై నిఘా వర్గాల నుంచి అందిన సమాచారంతోనే ఏసీబీ పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఈ భారీ పెళ్లి ఖర్చులకు సంబంధించిన నిధులను ఎక్కడి నుంచి సమకూర్చారనే దానిపై కూడా అధికారులు కుమార్ నుంచి వివరాలు రాబడుతున్నారు.

**ముందుంది బ్యాంకు లాకర్ల వేట**

ప్రస్తుతం కుమార్ నివాసాల్లో లభించిన ఆస్తులు కాకుండా, వివిధ బ్యాంకుల్లో ఆయన పేరిట, బినామీల పేరిట ఉన్న బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసేందుకు ఏసీబీ అధికారులు సర్వసన్నద్ధమవుతున్నారు. ఈ లాకర్లలో మరికొంత భారీ మొత్తంలో బంగారం, నగదు, బినామీ ఆస్తుల పత్రాలు ఉండే అవకాశం ఉందని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. కుమార్ బంధువుల ఇళ్లలో కూడా సోదాలు ఇంకా ముగియకపోవడంతో అక్రమ ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉంది. నిందితుడు అనంత్ లక్ష్మీ కుమార్‌ను కోర్టులో హాజరుపరిచి, తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కస్టడీకి కోరనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ అరెస్ట్ జలమండలితో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

## లులూ హైపర్‌మార్కెట్‌లో షాకింగ్ దృశ్యాలు
### పురుగులు పట్టిన పిండి, కుళ్లిన కూరగాయలు!

**హైదరాబాద్, మే 19 :**

హైదరాబాద్‌లోని ప్రముఖ షాపింగ్ కేంద్రమైన లులూ హైపర్‌మార్కెట్‌లో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనలకు సంబంధించి తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. స్టోర్‌లోని వివిధ విభాగాల నుంచి పాడైన దాదాపు 150 కిలోల ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఫుడ్ సేఫ్టీ కమిషనర్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

తనిఖీల్లో భాగంగా అధికారులు హైపర్‌మార్కెట్‌లోని ఇన్‌హౌస్ కిచెన్, రిటైల్ విభాగం, మాంసం విక్రయశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత అత్యంత దారుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన ఆహారాన్ని కనుగొని, వెంటనే దాన్ని పారవేయించారు. అంతేగాక ప్రాంగణంలో పురుగులు, కుళ్లిన కూరగాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడువు తీరడానికి దగ్గరలో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై చిరిగిన, తప్పుదోవ పట్టించే లేబుల్స్ ఉన్నట్లు కనుగొన్నారు.రిటైల్ విభాగంలోనూ పలు ఉల్లంఘనలు వెలుగుచూశాయి. శనగపిండి, గోధుమపిండి, పప్పులు వంటివాటిలో పురుగులు పట్టి ఉండటాన్ని అధికారులు గమనించారు. కొన్ని ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను గుర్తించారు.

అనేక ఉత్పత్తులపై పోషక విలువల సమాచారం, తయారీదారుడి చిరునామా, సరైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్ వంటి తప్పనిసరి వివరాలు లేకపోవడం గమనార్హం.మాంసం విక్రయించే బుచరింగ్ విభాగంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మాంసం వ్యర్థాలతో డ్రైనేజీలు మూసుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు .ఈ తనిఖీ అనంతరం పురుగులు పట్టిన స్వీట్లు, వంట నూనెలు, పిండి, పప్పులతో సహా సుమారు 150 కిలోల ఆహార ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, కృత్రిమ రంగుల వాడకం, పురుగుల కాలుష్యం వంటి అనుమానాలతో పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, తదుపరి విశ్లేషణ కోసం ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

## తీరం మనదే.. మత్స్య సంపదా మనదే

కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు.

ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మ వద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం.

మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# వర్తక సంఘం రద్దు చేయాలని సంతకాల సేకరణ


- ఆలయ ఈవో భవానీ శంకర్, అనువంశీక ధర్మకర్త బి. నర్సింహ మూర్తికి వినతి పత్రం
- కొండపైన దుకాణాలను టెండర్లు వేస్తే రూ.20 నుండి 30 కోట్లు ఆదాయం వస్తుంది.
- ఈ నెల 31న కొండపైన దుకాణాల కాలపరిమితి ముగుస్తుంది : యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు



**జయభేరి, యాదగిరిగుట్ట, మే19 :**

యాదగిరిగుట్ట దేవస్థానంలోని కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని ఈనెల 11న పాత గుట్ట చౌరస్తా వద్ద నిర్వహించిన సంతకాల సేకరణ జాబితాను మంగళవారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశీక నరసింహమూర్తికి యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం పేరిట దేవస్థానానికి సంవత్సరానికి 10 దుకాణాలకు కేవలం రూ.1 కోటి 68 లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు. అదే ఒక సెల్ ఫోన్ కౌంటర్ టెండర్ సంవత్సరానికి రూ. 2 కోట్ల 22 లక్షల పైగా దేవస్థానానికి ఆదాయం సమకూరుతుంది. ఇదేవిధంగా ఇతర టెండర్లలో కోట్లలో ఆదాయం వస్తుంది దేవస్థానంలో ప్రతి టెండర్లు ఒక సంవత్సరం కాల పరిమితితో కొత్తవారికి ఉపాధి వ్యాపార అవకాశాలు కల్పించి దేవస్థాన ఆదాయాన్ని అభివృద్ధితోపాటు భక్తుల సౌకర్యాలు పెంచే ప్రణాళిక చేయాలి. ఒక్కరే దేవస్థానంలో దుకాణాలను కొనసాగించాలని నియమాకం లేదు. అందరికీ అవకాశాలు కల్పించే దిశగా టెండర్లు జరగాలి, కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థానానికి ఆదాయం వస్తుంది.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము కొండపైన వర్తక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 10 దుకాణాలను రద్దుచేసి అదనంగా 30 కొత్త దుకాణాలు టెండర్లు వేయాలని స్థానికులు వ్యాపారస్తులు నిరుద్యోగులు, బాధితులు కోరుతున్నారు. ఈనెల 31 నాటికి కొండపైన వర్తక సంఘంలోని దుకాణాలకు గడువు ముగుస్తుంది. కాగా ప్రతి సంవత్సరం దేవస్థానం పరిధిలో టెండర్లకు 3 నెలల టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ టెండర్ల సమయం దగ్గర పడ్డ ఇంతవరకు టెండర్లు వేయకపోవడం గమనార్హం. కొండపైన దుకాణాలలో ప్రకటనలు జారీ చేస్తూ పాత, కొత్త వారికి అవకాశాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కొండపై ఉన్న దుకాణాలను కూడా టెండర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికంగా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల దేవస్థానానికి సుమారు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. అంతేకాదు కొత్తవారికి అవకాశం దక్కుతుంది. యాదగిరిగుట్టలో దేవస్థానంలో కొండపై ప్రస్తుతం ఉన్న 112 దుకాణాల కుటుంబాలకి పూర్తి వ్యాపార టెండర్ల హక్కులు లేవు కదా !దేవస్థానంలో ఆదాయం పెరిగితే అభివృద్ధి భక్తుల సౌకర్యాలు పెరుగుతాయి. ఎన్నో సంవత్సరాలుగా తిష్ట వేసుకొని కొండపైన దుకాణాలు కొనసాగుతూ వర్తక సంఘం పేరిట దేవస్థాన ఆదాయాన్ని గండి కొట్టే వారి వల్ల దేవస్థాన అభివృద్ధి సాధ్యమవుతుందా... లేక టెండర్ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వల్ల సాధ్యమవుతుందా.... కొండపైన ఉన్న షాపులను టెండర్లు వేస్తే వేలాది నిరుద్యోగులకు వ్యాపారస్తులకు ఉపాధి కలుగుతుంది. అంతేకాదు కొండ కింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ గత ప్రభుత్వం వెసులుబాటుగా నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు వేస్తే దేవస్థానానికి ఆదాయంతో పాటు వేలాది స్థానిక నిరుద్యోగుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. తరతరాలుగా కొనసాగుతున్న వ్యాపార, ఆర్థిక దోపిడిని అరికట్టాలంటే కొత్త వారికి అవకాశాలు కల్పించాలనేది స్థానిక ప్రజలు నిరుద్యోగులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు రచ్చ శ్రీనివాస్, గ్యాదపాక బాల్ నరసయ్య, మాటూరి బాలయ్య, బోనగిరి శ్యామ్, ఆరే స్వామి,బండ రామస్వామి, దండబోయిన వీరేష్, బండి వాసు, పల్లపు బాలయ్య, కర్రె ప్రవీణ్, బండి అనిల్, కొన్నె సంజీవ, గుండ్లపల్లి లింగం, కల్వకొలను సతీష్, బండి అనిల్, స్వర్గం నరేష్, సుదగాని శివ,ఆవుల రాజు, ముక్కెర్ల నరసింహ, మందోజ్ నరేష్, కర్రె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే19 :**

ప్రజా పాలనలో ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు తన నివాసం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతి సంక్షేమ పథకాన్ని మధ్యవర్తులు,పైరవీలు, కమిషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు కొనసాగుతున్నారు. పెన్షన్, రేషన్ కార్డు, సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగినా, కిరాయిల పేరుతో ఇబ్బంది పెట్టినా వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఇంద్రమ్మ ఇల్లు రెండో విడత అమలు జరుగునందని అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు పారదర్శంగా అందుతాయని తెలిపారు. ప్రతి పేదవాడు సుఖంగా ఉండడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఈనెల 23న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు రాక
- ఈనెల 22న యాదగిరిగుట్టను సందర్శించనున్న కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే19:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు ఈనెల 23న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. మంగళవారం ఆలయ ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 23న ఉదయం 9 గంటల 27 నిమిషాలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుంటారని అనంతరం, టెంపుల్ సిటీ నందు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమంలో కంచి పీఠాధిపతి శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పాల్గొంటారని అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుంది తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన నూతనంగా కళ్యాణ మంటపం, దీక్షాపరుల సదనం, కొండ కింది నుండి కొండపై వరకు మెట్ల దారి వెంట పైకప్పు షెడ్డును నిర్మించడం,పిఆర్ఓ ఆఫీస్ ఎదురుగా నూతనంగా మాడవీధులకు వెళ్ళేందుకు మెట్ల మార్గం (ఎక్సలేటర్) సదుపాయం పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,కంచి పీఠాధిపతి శంకరా విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని తెలిపారు. కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారని తెలిపారు. శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానానికి విచ్చేయుచున్నారని 4 గంటల నుండి 4: 45 నిమిషాల వరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కొండపైన కళావేదిక వద్ద సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమంలో పాల్గొంటారని,32 మంది చతుర్వేద పారాయణం అనంతరము విజయేంద్ర సరస్వతి వారు ప్రసంగం ఉంటుందని ఈ కార్యక్రమానికి భక్తులు స్థానికులు అధిక సంఖ్యలో రావాలని యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవాని శంకర్ తెలిపారు.

# మంత్రి లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని

**జయభేరి, పిడుగురాళ్ల :**

మంగళవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ కి యరపతినేని శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. అనంతరం గురజాల నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ లో ఉన్న పలు పనులు, తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు చర్చించుకున్నారు.

# ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ త్వరగా పూర్తి చేయించండి

- ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



**జయభేరి, దేవరకద్ర :**

పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గర ఉండి మరి యుద్ధ ప్రాతిపదికమైన పూర్తి చేయించాలని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ లోని ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో మంగళవారం ఉమ్మడి మహబూబ్ నగర్ లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. అలాగే జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రితో జరిగిన భేటీలో జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ కృష్ణమోహన్ రెడ్డి లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.


# పర్యాటక అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని జిల్లా భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ వద్ద మంగళవారం నిర్వహించిన పర్యాటక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా పాల్గొన్నారు. జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పర్యాటక యువజన క్రీడల వారోత్సవాలు సందర్భంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటక అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా రైతుల పంటలకు సాగునీరు అందిస్తూ జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కోయిల్ సాగర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే జిల్లాకే కాకుండా రాష్ట్రం, దేశానికే కూడా మంచి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు డ్యాంను సందర్శించి ప్రాజెక్టు ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం, నీటి వనరుల లభ్యత, వ్యవసాయానికి తాగునీటి అవసరాలకు ఎంత నీటిని వాడుతున్నారు, ప్రాజెక్టు యొక్క మరమ్మతు నిర్వహణ, పెండింగ్ నిర్మాణం వాటి విషయాల గురించి జిల్లా కలెక్టర్ సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదరపు కలెక్టర్ జేఎల్ బి హరిప్రియ, జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, దేవరకద్ర మండలం తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ లతోపాటు అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ లో భారత్ కు పుతిన్



**జయభేరి, న్యూఢిల్లీ, మే 19 :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం.రష్యాఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్‌రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

# ఎన్ పి ఆర్డీ శిక్షణా తరగతులు నిర్వహించుకోవడం సంతోషకరం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 19 :**

ఎన్ పీ ఆర్డీ శిక్షణా తరగతుల నిర్వహించుకోవడం సంతోషకరమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఈ నెల 29,30,31వ తేదీలలో యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న తలపెట్టిన ఎన్ పీఆర్డీ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల వాలిపోస్టర్ ను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగుల హక్కుల సాధన కోసం,వారి సంక్షేమం కోసం నాయకత్వం ప్రతిష్టను పెంపొందించేందుకు శిక్షణా తరగతులు నిర్వహించడం సంతోషకరమన్నారు. వికలాంగుల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పరికరాలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. వికలాంగులకు అన్ని విధాలుగా సహాయం అందిస్తాననని హామీ ఇచ్చారన్నారు. అధ్యక్షుడు కె. వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చే ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాదగిరిగుట్టలో జరిగే ఈ మూడు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి,వారి హక్కుల రక్షణకు తమ సంఘం ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సురుపంగ ప్రకాష్,జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత,జిల్లా నాయకులు పాండాల శ్రీహరి,నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

# ఇటుకల బట్టిని సందర్శించిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి



**జయభేరి, తుర్కపల్లి, మే 19 :**

తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలోని ఇటికల బట్టిని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవి లత సందర్శించారు. ఈ సందర్భంగా బట్టిల కార్మికుల కుటుంబాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి హక్కుల గురించి వివరించి సంక్షేమ పథకాలు పొందడానికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని, తిరిగి ఒరిస్సాకు వెళ్లిన వారి పిల్లల భవిష్యత్తుకై అక్కడ చదువులను కొనసాగించాలని, తెలిపి ఏదైనా న్యాయ సహాయం కోసం న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించవచ్చని 15 100 కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటిక బట్టీల కార్మికులు పాల్గొన్నారు.

# సందేశ్ ఆత్మక చిత్రం ఓ నాన్న కథ

- మంచి ప్రజాదరణ పొందిన చిత్రం
- నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన చిత్రం
- మెసేజ్ ఓరియెంటర్ చిత్రంగా గుర్తింపు
- దేవరకొండ మనో థియేటర్లో ప్రదర్శించిన ఓ తండ్రి కథ
- చిన్న చిత్రాలను ప్రోత్సహించాలి.. ప్రొడ్యూసర్ గా లెంకల సాగర్ రెడ్డి
- మరిన్ని చిత్రాలను నిర్మిస్తా

జయభేరి, దేవరకొండ :



కన్న బిడ్డలను అల్లారుముద్దుగా కని పెంచి పెద్ద చేసి వారి యొక్క కలలను సహకారం చేయడం కోసం తల్లిదండ్రులు పడేటువంటి కలలను బిడ్డలు సహకారం చేస్తారని ఆశించినటువంటి తరుణంలో ఎదురయ్యేటువంటి అనేక మైనటువంటి మలుపులతో కూడినటువంటి సందేశాత్మక చిత్రం ఓ నాన్న కథ అని ప్రొడ్యూసర్ లెంకల సాగర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆ చిత్రాన్ని స్థానిక మనోజ్ థియేటర్లో ప్రదర్శించి అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చిత్రానికి ఆయన ప్రొడ్యూసర్ గా తండ్రిగా నటించినట్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న రొటీన్ చిత్రాలకు భిన్నంగా తండ్రి కూతురు విషయంలో ఎదురయ్యేటువంటి మలుపులను చిత్ర రూపకంగా రూపొందించినట్లు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తన కూతురు క్షణికావేశం లో తీసుకునేటువంటి నిర్ణయం వల్ల అటు కూతురు ఇటు తల్లిదండ్రులు ఎదుర్కొనేటువంటి సమస్యలను చిత్ర రూపకంలో రూపొందించినట్లు తెలిపారు. తాను గతంలోనే అశోక్ రెడ్డి, గులాబీమేడ ,శ్రీరంగ నాయక , షూటర్, తో పాటు ఓ తండ్రి కథ నిర్మించి విడుదల చేశానని వాటికి మంచి ప్రజాదరణ వచ్చిందని తెలిపారు. తనది గుర్రంపోడు మండలం మక్కపల్లి గ్రామం అని తాను చిన్నతనం నుండి కలలు కలల పట్ల ఆసక్తి తన చిన్నతనంలో గ్రామాలలో నాటకాలు వేసే వాడిని తెలిపారు. తను నిర్మించేటువంటి సినిమాలు థియేటర్లో రిలీజ్ కాకపోవడం బాధాకరమని చిన్న చిత్రాలను థియేటర్లో రిలీజ్ చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలిపారు. తాను ఇంద్రపతి ,టెంపర్ కృష్ణ, ప్రేమిస్తే చావైనా, మరో మూడు చిత్రాలను నిర్మించబోతున్నానని విడుదలకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా థియేటర్ నుండి వచ్చిన ప్రేక్షకులు సైతం సినిమా పట్ల వారి అభిప్రాయాలను తెలియజేశారు. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఎల్ఐసి ఏజెంట్ గాజుల రాజేష్ లు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత అన్నలోచిత నిర్ణయాల పట్ల ఎదుర్కొనేటువంటి సమస్యల పట్ల చిత్ర రూపకంగా సాగర్ రెడ్డి నిర్మించడం గొప్ప విషయం అని తెలిపారు. భవిష్యత్తులో సైతం మరిన్ని చిత్రాలను నిర్మించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నంది వెంకట్ రెడ్డి కోట శంకర్రావు, మంచి కంటి వెంకటేశ్వర్లు తోట సుబ్బారావు ,హీరోయిన్ వరణ్య ,పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ పున్నమి శైలజ వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ కార్యదర్శి లకుమారపు మల్లయ్య , కోశాధికారి కొండూరు ఆంజనేయులు ఎల్ఐసి సభ్యులు రాములు, రామలింగం, చారి లయన్స్ క్లబ్ జెడ్ సి వనం శ్రీనివాసులు, మాదిరెడ్డి సంధ్యా రెడ్డి, గాజుల ఉషారాణి డిసి, చేరుపెల్లి జయలక్ష్మి , డాక్టర్ పి జె సామ్సన్, శివ పార్వతి ,మాకం సువర్ణ ,మక్కపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యుల అధికమాసం పూజలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం స్థానిక ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో అధికమాసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా 33 దేవతలకు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈరోజు స్థానిక శ్రీ సద్గురు ఈశ్వర వీరప్ప స్వామి వారి దేవాలయంలో గోమాతకు ఒడిబియ్యం నింపే పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గ్రామ దేవత అయిన స్థానిక శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారికి కూడా ఒడినింతే పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెగిపోయిన కుంటను పరిశీలించిన అధికారులు



జయభేరి, తుర్కపల్లి, మే 20 :

తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపురం గ్రామంలో ఇటీవల తెగిపోయిన నింగుల కుంట ను మంగళవారం డిఆర్డిఏ నాగిరెడ్డి, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. ఇటీవల గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి గ్రామంలో నింగుల కుంట చెరువు తెగిపోవడం జరిగిందని ఫారెస్ట్, డి ఎఫ్ ఓ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఫారెస్ట్ అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులు, ఉపాధి హామీ అధికారులు తెగిపోయిన కుంటను పరిశీలించి మరమ్మత్తులు చేయడానికి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇట్టి పనులను ఉపాధి హామీ నిధుల ద్వారా మరమ్మత్తులు చేసే విధంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లంకల గీతారెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జావేద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏపీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, పాల్గొన్నారు.

## కమలాపూర్ రైతు వేదిక నందు వీడియో కాన్ఫరెన్స్



జయభేరి, దేవరకొండ :

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో స్పోర్ట్స్ వీక్ లో రెండవ రోజు కెరీర్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ పరిగణిస్తూ కమలాపూర్ రైతు వేదిక నందు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనడం జరిగినది అందులో 40 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మరి వారి యొక్క భవిష్యత్తుకు సంబంధించిన విద్య మరియు స్పోర్ట్స్ కు సంబంధించిన అనేక విషయాలు నేర్చుకోవడం జరిగిన ది. అని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT, PD లు J చంద్రయ్య, తస్లీమ్, నిర్వాహకులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో MPDO S డానియల్ గారు పాల్గొని విద్యార్థులకు విద్యా గురించి క్రీడల గురించి వివరించారు. నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాము, వీరన్న, రమేష్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్ అరెస్టు నిర్బంధం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమానికి ముందస్తు అరెస్టు చేసి నిర్భదించడం జరిగింది అనంతరం జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్ మాట్లాడుతూ రైతుల గోస తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఓ స్త్రీ రేపు రా అనే విధానాలతో రోజులు గడుపుతున్నారు తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేసిందని చందు నాయక్ ధ్వజమెత్తారు జరుగుతున్న అన్యాలపై రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమం బయలుదేరే సమయంలో ఊరి సమస్యల గురించి మాట్లాడుతుండగా దేవరకొండ పోలీస్ వారు అక్కడికి విచ్చేసి జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్ కు పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించడం జరిగింది ఎన్ని అరెస్టులు చేసినా మా ఉద్యమాన్ని ఆపలేరు ప్రజల తరఫున బరాబర్ ప్రశ్నిస్తాం భయపడేది లేదు అని చందు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర తండా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రాజెక్టులు, చారిత్రక ప్రదేశాలను సందర్శించాలి

- పాలమూరు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా
- కోయిల్ సాగర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఘన సన్మానం

జయభేరి, దేవరకద్ర :



చారిత్రక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించడం ద్వారా ఆనందమే కాకుండా ప్రాజెక్టుల ప్రాముఖ్యత, మన పూర్వికుల చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాల గురించి సంపూర్ణ అవగాహన కలుగుతుందని పాలమూరు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కోయిల్ సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో వుంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కాంపౌండ్ గోడ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన వేసవి క్యాంపులో శిక్షణ పొందిన వాలీబాల్ క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలైన పిల్లలమర్రి, కోయిల్ సాగర్ ప్రాజెక్టు తదితర ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. ఇటువంటి పర్యటనల ద్వారా వినోదంతో పాటు జ్ఞానాన్ని కూడా విద్యార్థులు పెంపొందించుకోవచ్చు అన్నారు. పిల్లలు ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకొని సందర్శించిన ప్రదేశాల విశేషాలను అక్కడి నిపుణులు అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. దీని ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## గాయపడ్డ వారిని పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దమగ్నాపూర్ లో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన వారిని మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి జి. కవిత మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా గాయపడ్డ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటామని కవిత మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



జయభేరి, హయత్‌నగర్ :

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీ, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లాకి చెందిన భాను (21) అనే మహిళ 09 తేదీన రాత్రి ఇంటి నుండి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఆమె భర్త బజార్ శివ పనిమీద నాదర్‌గుల్‌లో ఉండగా రాత్రి 12:47 గంటలకు ఫోన్‌లో మాట్లాడింది. అనంతరం భర్త ఇంటికి చేరుకునే సరికి ఆమె కనిపించలేదు. బంధువులు, పరిసర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె గురించి ఎవరికైనా సమాచారం తెలిసిన యెడల దయచేసి క్రింది నంబర్లకు సమాచారం అందించగలరు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 63013 62509.

# తీదేడు గ్రామ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండపం నిర్మాణానికి గ్రామ ప్రజలు,యువత స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా తీదేడు గ్రామానికి చెందిన మద్రు జయసుధ - సురేందర్ రావు దంపతులు రూ.1,00,116/ (ఒక లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందించగా, తీదేడు బిసి కాలనీ యూత్ ఆధ్వర్యంలో రూ.20,116/ (ఇరవై వేల నూట పదహారు రూపాయలు) విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు ఐక్యంగా ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గోవర్ధనాచారి, పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, గ్రామ ప్రజలు సిమర్ల శ్రీను యాదవ్, బొడ్డు యాదగిరి, బెక్కం సైదులు,శివర్ల ప్రవీణ్, బెక్కం సాయి కుమార్, మొరుపోజు రాజు, మునగాల రవి, మునగాల లక్ష్మణ్, ఐతమోని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బుట్టబొమ్మ బికినీ సెగలు..




టాలీవుడ్ బుట్టబొమ్మ గా ఇక్కడ స్టార్ హోదా అందుకుని మెల్లగా ఇటు కోలీవుడ్ అటు బాలీవుడ్ అంటూ మనకు దూరంగా అడుగులు వేసింది పూజ హెగ్డే. ప్రస్తుతం ఆమె వరుణ్ ధావన్ తో కలిసి నటించిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' జూన్ 5 న విడుదలకు సిద్ధంగా ఉంది. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో మెల్లగా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టారు మేకర్స్. అందులో భాగంగా ఒక వీడియో సాంగ్ ను రీసెంట్ గా విడుదల చేసారు. తేరా హో జౌన్ అంటూ సాగే ఆ సాంగ్ ట్యూన్ ఓకే అనేలా ఉన్నా, అలా విడుదలయ్యిందో లేదో వెంటనే ఇంటర్నెట్ ని ఊపేస్తోంది. దీనికి కారణం ఒక్కటే...అదే పూజ హెగ్డే అందాల ఆరబోత. గతంలో ఎప్పుడూ కనిపించనంత అందంగా, సమ్మర్ కే వేడిని పుట్టించేలా ఫ్లోరల్ బికినీ వేసుకుని పైన బటన్ కూడా పెట్టని ఒక డెనిమ్ షార్ట్స్ తో పూజ సెగలు పుట్టించేలా కనిపించడంతో జనాలకు మతిపోయింది. సాంగ్ లోనే చూసి మతిపోయిందిరా బాబు అని ఫ్యాన్స్ అనుకుంటుంటే మీకు ఈ డోస్ సరిపోదు అంటూ ఆ బికినీ లో దిగిన కొన్ని ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియా వేదికగా అభిమానుల కోసం ఇప్పుడు పూజ హెగ్డే పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియా లో దుమ్ము దుమారం లేపుతున్నాయి... ఈ మధ్య కాలంలో చేసిన సినిమాలన్నీ వరసపెట్టి ఫ్లాపులు కావడంతో కాస్త వెనకబడ్డ పూజ గతేడాది 'కూలీ' చిత్రంలో మోనికా సాంగ్ తో బాగానే రచ్చ రేపింది. అది మర్చిపోయేలోపు ఇప్పుడు ఈ బికినీ ఫోటోలతో అంతకు మించిన డబుల్ డోస్ ఇస్తూ తన అభిమానులకు పండగ చేసింది. ఫ్లోరల్ బికినీ లో ఆమె దిగిన ఫోటోలు, వీడియోలు చూసిన నెటిజన్లు ఫ్లాపులొచ్చినా అందంలో పూజను కొట్టే హీరోయిన్ లేదు, అందరికీ ఏజ్ పెరిగితే పూజకు మాత్రం వయసు రోజు రోజుకూ తగ్గిపోతుందంటూ ఆమె ఫోటోలను చూసి కామెంట్లతో నింపేస్తున్నారు. పూజ క్వీన్ అంటూ, మూడవ ప్రపంచ యుద్ధం ఈమె వల్లే వస్తుంది, అందాల ఆటం బాంబ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



# స్పిరిట్‌లో సైలెంట్ వార్?

దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పాన్ఇండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టీజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.

# నెవర్ బిఫోర్ యాక్షన్?



అగ్ర హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ గప్‌చుప్‌గా ముంబైలో షూటింగ్‌ని కానిచ్చేస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రాకా' చిత్రం పాన్ఇండియా స్థాయిలో రూపొందుతున్న విషయం తెలిసిందే. దీపికా పదుకోన్ కథానాయిక. మరికొందరు హీరోయిన్లు సైతం ఈ సినిమాలో కనిపించబోతున్నట్టు వినికిడి. వచ్చే ఏడాది సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్‌ని ప్రస్తుతం అట్లీ తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. హాలీవుడ్ స్థాయిలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆయన ప్లాన్ చేశారట. కళ్లరిత్తా ఎగురుతున్న ఫ్లైట్‌లో ఈ పోరాట సన్నివేశాలుంటాయట. ఈ క్రేజీ యాక్షన్ సీక్వెన్స్ కోసం నిర్మాతలు భారీగానే ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. ఈ సినిమాలోని ప్రతి యాక్షన్ సీక్వెన్స్ నెవ్వర్ బిఫోర్ అనేలా ఉంటాయని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇంటర్వెల్ ఎపిసోడ్ అయితే సినిమాకే హైలైట్ అట. అట్లీ సినిమాల్లో అంతర్లీనంగా సందేశం ఉండటం సహజం. ఈ సినిమాలో కూడా ఓ అద్భుతమైన సందేశం ఉంటుందని తెలిసింది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# తేజ సజ్జా మిరాయ్ 2 షూటింగ్ షురూ.. ఇంతకీ ఎక్కడో తెలుసా..?



కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్‌లో హనుమాన్ ఫేం తేజ సజ్జా నటించిన చిత్రం మిరాయి. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో ఢిల్లీ భామ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటించగా.. మంచు మనోజ్ కీ రోల్ పోషించాడు. ఈ మూవీ బాక్సాఫీస్ వసూళ్ల వర్షం కురిపించింది. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్ మిరాయి 2 కూడా రాబోతున్న విషయం తెలిసిందే. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సీక్వెల్ వార్త రానే వచ్చింది. మిరాయి 2 షూటింగ్ నేడు వైజాగ్‌లో షురూ అయింది. ఆర్కే బీచ్‌లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినట్టు సమాచారం. ఈ షెడ్యూల్ 10 రోజులపాటు జరుగనుందని ఫిలింనగర్ సర్కిల్ టాక్. వైజాగ్ బీచ్ రోడ్‌లో షూటింగ్‌కు సంబంధించిన విజువల్స్ ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి. ముందుగా వచ్చిన వార్తల ప్రకారం సీక్వెల్‌లో బాహుబలి స్టార్ రానా దగ్గుబాటి విలన్‌గా నటిస్తున్నాడు. మంచు మనోజ్ మరోసారి తన పాత్రలో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మరిన్ని వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్.

# ఒక్క ఛాన్స్ వస్తే అస్సలు వదిలిపెట్టను..

తన ఫేవరెట్ యాక్టర్ గురించి అడిగిన ప్రశ్నకు హెబ్బా పటేల్ ఏమాత్రం తడుముకోకుండా జూనియర్ ఎన్టీఆర్ పేరు చెప్పారు. తారక్ నటన, ఆయన పర్సనాలిటీ అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. 'కుమారి 21F' సినిమా టీజర్ లాంచ్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుండి ఆయనపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడిందని హెబ్బా గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమాలో నటించే అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమేనని హెబ్బా పటేల్ స్పష్టం చేశారు. "ఆయన సినిమాలో నాకు పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా, కథలో ఇంపార్టెంట్ లేకపోయినా పర్వాలేదు. కనీసం నన్ను వెనుక బ్యాక్‌గ్రౌండ్‌లో నిలబెట్టినా నేను ఆ పాత్ర చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే కొన్ని సార్లు కెరీర్ బ్రేకింగ్ పాత్రల కంటే, మనకున్న బలమైన కోరికలను తీర్చుకోవడం ముఖ్యం" అంటూ తారక్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు కమెడియన్ సునీల్ చాలా స్వీట్, కేరింగ్ పర్సన్ అని అన్నారు. తన కెరీర్‌లో అత్యంత కంఫర్టబుల్ కోస్టార్ రాజ్ తరుణ్ అని చెప్పారు. ఆయనతో ఎక్కువ సినిమాలు చేయడం వల్ల ఆ బాండింగ్ ఏర్పడిందని, అయితే ఇద్దరం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసాం కాబట్టి కొంతకాలం కలిసి నటించకపోవడమే మంచిదని నవ్వుతూ అన్నారు అలాగే తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో తన నటన తనకు బాగా నచ్చిందని తెలిపారు. ప్రస్తుతానికి తాను పూర్తిగా సింగిల్‌గానే ఉన్నానని హెబ్బా క్లారిటీ ఇచ్చారు. ముంబై (మహారాష్ట్ర) లో జన్మించిన హెబ్బా పటేల్, అక్కడే తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో హెబ్బా పటేల్ చాలా యాక్టివ్‌గా ఉంటారు. తన గ్లామరస్ ఫోటోషూట్స్, ట్రావెల్ అప్‌డేట్స్‌తో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను అలరిస్తుంటారు. ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన ప్రతి పోస్ట్ క్షణాల్లో నెట్టింట వైరల్ అవుతుంది. ప్రస్తుతం ఆమె కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటిస్తుంది.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**